క్లుప్తంగా

రెవెన్యూ, అటవీ శాఖల సమగ్ర సర్వే



జాయింట్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని సర్వే నంబర్–55లోని 194 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. సరిహద్దుల వివరాలను తహసీల్దార్ తిరుమలాచారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.విజయలక్ష్మిలను సర్వే లాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాసులు అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు లూర్దు, శ్రీనివాసరావు, మండల తహసీల్దార్ ఎస్.తిరుమలాచారి, ఆర్‌ఐ అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక

కల్లూరు రూరల్: కొర్లగూడెంలో నిర్మించిన 10 డబుల్ బెడ్ రూం ఇళ్లకు శనివారం గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తం 51 దరఖాస్తులు రాగా అర్హులుగా 13 మందిని గుర్తించారు. లాటరీద్వారా 10మందిని ఎంపిక చేశారు. పీహెచ్‌సీ-1, ఎస్సీ 7, బీసీ 2 ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మండల స్పెషల్ ఆఫీసర్లు సునీత, ఏఎస్సై చారి, పంచాయతీ కార్యదర్శి, ఆర్‌ఐ సర్పంచ్, ఎంపీటీసీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వీఆర్‌ఏల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

ముదిగొండ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముదిగొండ తహసీల్ ఎదుట శుక్రవారం వీఆర్‌ఏలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ముదిగొండ మండల వీఆర్‌ఏలు కోరారు.

15 నుంచి మండల స్థాయి క్రీడలు

మధిర/వైరారూరల్: ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే సీఎం కప్ పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మధిర, వైరా ఎంపీడీఓలు సీలార్ సాహెబ్, శ్రీదేవి కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చీఫ్ మినిస్టర్ కప్ 2023 సంవత్సరానికి గాను మండల స్థాయిలో మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాల ఆవరణలో, వైరాలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు జరుగుతాయన్నారు. ఈ క్రీడల్లో 15 నుంచి 36 సంవత్సరాల వయసు కలిగిన పురుషులు, స్త్రీలు పాల్గొనవచ్చునని సూచించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను మధిరలోని ఎంఈఓ (99594 83175) కార్యాలయంలో, వైరావారు 99895 84636, 85003 71015 నంబర్లను సంప్రదించాలన్నారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోండి



ఎస్సై సురేష్

ఎర్రుపాలెం: ఈ నెల 21న ఖమ్మంలో పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్సై ఎం.సురేష్ తెలిపారు. ఖమ్మం పట్టణంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 9.30 గంటలకు కళాశాలకు అభ్యర్థులు తమ, తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికేట్లను వెంట తీసుకెళ్లాలని సూచించారు.

ఆర్థిక సాయం

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన గీత కార్మికుడు ఆరేపల్లి రామారావు కుటుంబాన్ని శుక్రవారం ఖమ్మం జాగృతి హాస్పటల్ అధినేత, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్, స్థానిక బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావుతో కలిసి పరామర్శించారు. ట్రస్టు తరపున బాధిత కుటుంబానికి రూ.10 వేలు సాయం అందజేశారు. పేద గౌడ్ కులస్తులకు ఖమ్మంలోని తమ జాగృతి హాస్పిటల్ ద్వారా తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహారావు నాయకులు గోపి, రమేష్, నరసింహ గౌడ్, వెంకట్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇది షాదీఖానా భవనమేనా..?

- మరమ్మతులకు నోచుకోని భవనం
- నిర్వహణ కమిటీ లేకపోవడంతో కొరవడిన పర్యవేక్షణ
- మండిపడుతున్న స్థానికులు



ఎర్రుపాలెంలో శిథిలమైన షాదీఖానా భవనం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో గత రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన షాదీఖానా భవనం దుస్థితి అధ్వానంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ పరమైన ఏ కార్యక్రమానికి కూడా వినియోగించడానికి వీలు లేకుండా ఉంది. ఈ భవనాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఇది కూడా షాదీఖానా భవనమేనా..? అని అంటున్నారు. ముస్లింలు, పేదలు ఇలా అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని చెప్పుకుంటున్న పాలకులకు ఇది కనిపించడం లేదా అంటూ స్థానికులు మండిపడుతున్నారు. భవనం మరమ్మతులకు నిధుల మంజూరు విషయంలో ఏ ఒక్క ప్రజాప్రతినిధి, అధికారి ముందుకు రావడం లేదు. భవనం నిర్వహణ విషయంలో సైతం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు.

2007లో ప్రారంభం..

మండలంలోని అన్ని గ్రామాల్లోని ముస్లింలు, పేదలు పలు శుభకార్యక్రమాలతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ కార్యక్రమాల ఏర్పాటు కోసం 2003 సంవత్సరంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయగా అప్పటి మంత్రులు ఎండీ ఫరూక్, తుమ్మల నాగేశ్వరరావులు శంకుస్థాపన చేశారు. ఆ నిధులతో భవన నిర్మాణం పూర్తి కావడంతో 2007న డిసెంబర్ 20న అప్పటి కేంద్ర మంత్రి రేణుకాచౌదరి, అప్పటి రాష్ట్ర మంత్రులు రెడ్యా నాయక్, సంభాని చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఒక్క రూపాయి కూడా ఈ భవనం కోసం వెచ్చించలేదు. ఆ దిశగా ఆలోచించే వారే లేకుండా పోయారు.

పరిష్కారానికి నోచుకోని సమస్యలు..

భవనం నిర్మించిన రెండు, మూడేళ్లకే శ్లాబు పెచ్చులూడి పడ్డాయి. దీంతో వర్షం కురుస్తుంది. పలు చోట్ల పగుళ్లు వచ్చాయి. ప్రహరీ గేటుతో పాటు గోడలు కూడా విరిగి పడ్డాయి. కిటికీలు లేవు, ఫ్యాన్లు పాడయ్యాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఇలా అన్నీ శిథిలమయ్యాయి. భవనం మెట్లు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. భవనం చుట్టూ పిచ్చి చెట్లు దట్టంగా పెరిగాయి. ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కూడా మారింది.

షాదీఖానా కమిటీ ఏదీ ?

ఈ భవనంలో కార్యకలాపాలు ప్రారంభమై 16 ఏళ్లు అయినా ఇప్పటి వరకు కూడా నిర్వహణ కమిటీ ఏర్పాటుకు నోచుకోలేదు. కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో ఎవరికి వారే ఈ భవనంలో ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీలు, పలు సంస్థల సమావేశాలు, పలువురు శుభ కార్యక్రమాలు, ఇతరత్రా ప్రోగ్రాంలను నిర్వహించుకున్నారు. ఇందుకు సంబంధించి నేటికీ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి జమ కాలేదు. ప్రభుత్వానికి కమిటీని ఏర్పాటు చేసే తీరిక లేకుండా పోయిందని ముస్లింలు మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారయంత్రాంగం స్పందించి షాదీఖానాకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



భవనం ఆవరణలో మొలచిన పిచ్చి మొక్కలు

కమిటీని నియమించాలి..



రెండు దశాబ్దాలుగా షాదీఖానా నిర్వహణ కమిటీని నియమించకపోవడం సరికాదు. భవన నిర్మాణం మంజూరు కోసం ఎన్నో వినతిపత్రాలిస్తే అప్పటి ప్రభుత్వం స్పందించి భవనాన్ని నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు.

– షేక్ జానీబాషా, మీనవోలు

నిధులు మంజూరు చేయాలి..



ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి. వినియోగంలోకి తెచ్చేందుకు పాలకులు, అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

నిధుల మంజూరు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు, షాదీఖానా వినియోగంలోకి వస్తే మండలంలోని అన్ని గ్రామాల పేద ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– షేక్ మహబూ సుభాని, ఎర్రుపాలెం

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



షాదీఖానా భవనం శిథిలమవుతున్న మాట వాస్తవమే. ఈ భవనానికి మరమ్మతులకు నిధులు మంజూరు విషయం వక్ఫ్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. భవనం నిర్వహణ కమిటీ కూడా ఆ అధికారులే వేయాల్సి ఉంది. సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

– ఎస్.తిరుమలాచారి, తహసీల్దార్, ఎర్రుపాలెం

ఉన్నత లక్ష్యాలు సాధించాలి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పట్టణంలోని త్రివేణి పాఠశాల, గాయత్రి, విద్యాభారతి జూనియర్ కళాశాలల్లో పది, ఇంటర్‌లలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్కరించారు. పదోతరగతిలో సీహెచ్ స్ఫూర్తి, జ్వలిత, అమృతవర్షిణి, లీమా, మాడా సాత్విక, ఇంటర్ స్టేట్ థర్డ్ ర్యాంక్‌లు సాధించిన రుష్మిత, స్నేహ, శ్రీనిజలను అభినందించారు. అదేవిధంగా జలగంనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పామర్తి సురేష్‌కు రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, ఎస్‌కే రఫీ, చల్లగుండ్ల కృష్ణయ్య, అంకమరాజు, కూసంపూడి మధు, జి.వి.లింగారెడ్డి, గాదె నర్సింహారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు పరామర్శ

వైరారూరల్: మండలంలోని గోవిందపురంలో శుక్రవారం ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ పర్యటించారు. ఇటీవల మృతి చెందిన బుద్ధా మాణిక్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆమె కుమారుడు వైరా మార్కెట్ చైర్మన్ బీడీకే.రత్నంను పరామర్శించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వర్లు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, సర్పంచ్ బుద్ధా సురేష్, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములుతో పాటు షేక్ లాల్ మహ్మద్, బాణాల వెంకటేశ్వర్లు, పసుపులేటి మోహన్‌రావు, మచ్చా వెంకటేశ్వర్లు, కట్టా కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి

మధిర: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయపట్నం సర్పంచ్ నండ్రు సుశీల అన్నారు. రాయపట్నం ఇసుక రేవు నుంచి అనుమతులు లేకుండా రేయింబవళ్లు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో అర్ధరాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఇకే కూపన్‌పై రెండు మూడు ట్రక్కులు తీసుకెళుతున్నారని తెలిపారు. అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. వాహనాల రాకపోకలు లేకుండా జేసీబీతో ఆ రోడ్డుకు గండి పెట్టారన్నారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు స్పందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కారేపల్లి: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. కారేపల్లికి చెందిన బానోత్ మంగ్యా గిద్దవారిగూడెంకు శుక్రవారం సైకిల్‌పై వెళ్లి వస్తుండగా ఖమ్మం నుండి కారేపల్లికి ద్విచక్రవాహనంపై వస్తున్న వారు అంబేడ్కర్ సెంటర్ సమీపాన ఢీకొట్టారు. ఈ ఘటనలో మంగ్యాకు తీవ్ర గాయాలు కాగా, కారేపల్లి చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ గ్రామంలో తండ్రికి భోజనం పెట్టే విషయంలో ఇద్దరు కుమారుల మధ్య శుక్రవారం నెలకొన్న వివాదంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయంలో వంగూరి మల్లయ్యపై సోదరుడు రమేష్ దాడి చేశాడు. మల్లయ్య చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై పాదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నారు.

వేతనాలు చెల్లించాలి

పెనుబల్లి : పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా వేతనాలు మంజూరు కాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా రేషన్ డీలర్ల నియామక ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణ

కల్లూరు: రెవెన్యూ డివిజన్‌లోని మండలాల పరిధిలో గల రేషన్‌షాపులకు సంబంధించి నియామకం కోసం శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, తల్లాడ, వేంసూరు, ఏన్కూరు మండలాల్లో ఖాళీగా ఉన్న 50 రేషన్ షాపులకు 2021లో డిసెంబర్ నెలలో అర్హత పరీక్ష నిర్వహించగా అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. శుక్రవారం పెనుబల్లి, వేంసూరు, ఏన్కూరు మండలాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి. శనివారం కల్లూరు, సత్తుపల్లి, తల్లాడ మండలాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

కన్నుల పండువగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

కారేపల్లి: మండలంలోని తొడితలగూడెం గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో కల్యాణాన్ని కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు ఉదయభాస్కర్, నవీన్‌ల ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులు స్వామిని ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా పుణ్యదంపతులు అంబటి కృష్ణ – రాజ్యంలు పీటలమీద కూర్చోగా, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంఠమహేశ్వర స్వామి విగ్రహాల ఊరేగింపు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వర స్వామి, సురమాంబదేవి విగ్రహాల ప్రతిష్ఠను పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద గౌడ కులస్తులు పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గౌడ కులస్తులు మాలధారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గౌడ కులస్తులు, పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ముదిగొండ: అకాల వర్షాలు, గాలి దుమారాలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బట్టు పురుషోత్తం అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కురిసిన వర్షాలతో నష్టపోయిన పేదల గృహాలను పరిశీలించి ఆదుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దామోదర్, బట్టు రాజు, వెంకయ్య, కల్యాణ్, వీరభద్రం, సతీష్, సాయి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



తల్లాడ: కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

తల్లాడ/ఏన్కూరు: అంక్షలు లేకుండా వడ్లను కొనుగోలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడలోని కలకొడిమ గ్రామంలో, ఏన్కూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షాలతో వరిపంట తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తరుగు పేరుతో మిల్లర్లు క్వింటాకు ఐదు కిలోలు తీస్తున్నారని, నిబంధనల ప్రకారం ఒక కేజీ మాత్రమే తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు తాతా బాస్కర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, మాదినేని రమేష్, రైతులు, సీపీఐ నాయకులు అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, బోగినబోయిన నాగేశ్వరావు, కొత్తపల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాంబాబు

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంపై నిర్లక్ష్యం వహించరాదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాంబాబు సిబ్బందికి సూచించారు. శుక్రవారం కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఇక్కడకు వచ్చిన ప్రజలను ఎండలో ఉంచరాదని, వారికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అంతకుముందు కారేపల్లి పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేసి, రోగులతో మాట్లాడి, వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వీరివెంట పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్, వైద్యురాలు శ్రేష్ఠ, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యం, కంటి వైద్యులు రాజేంద్ర కంటి, ఎఎస్‌ఎం శ్యామల, అనిత, ఆశా వర్కర్లు సరస్వతి, కల్యాణి పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం



మధిర: నర్సులను అభినందిస్తున్న స్విమ్మర్లు



సత్తుపల్లి టౌన్ : నర్సులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

మధిర/సత్తుపల్లిటౌన్/పెనుబల్లి : ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నర్సులు అందిస్తున్న సేవలు అభినందనీయమని మధిర అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి, సత్తుపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, పెనుబల్లిలో నర్సింగ్ సూపరింటిండెంట్ కె.లిల్లీ ప్రకాశ్‌రావులు తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మధిర, సత్తుపల్లి, పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సులను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగెల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాండిల్స్‌తో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కనకపూడి అనీల్ కుమార్, దగ్గుపాటి శ్రీను, స్విమర్స్ చల్లా సత్యనారాయణ, రాము, ఊటుకూరు భాస్కరరావు, రవీందర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ కొల్లేటి విజయలక్ష్మి, నర్సులు ఎస్.ఎస్.విజయలక్ష్మి, సీనియర్ స్టాఫ్ నర్సులు జ్యోతి, ఇందిరా, లలిత, దుర్గా, ఉషా, ఉమా, శ్రీదేవి, హసంబి, శారద, మాధవి, వైద్యులు ఎల్.భాస్కర్‌నాయక్, శివకృష్ణ, కిరణ్‌కుమార్, వినీష్, స్రవంతి, పృథ్వీ, ఫార్మాసిస్టులు సతీష్, రోజా, పెనుబల్లి ఆస్పత్రి సిబ్బంది సింగిశాల రాంబాబు, కోట కుటుంబరావు, లింగపోగు రమేష్, మోదుగు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



తల్లాడ: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సంభాని చంద్రశేఖర్, తదితరులు

తల్లాడ/ఎర్రుపాలెం: రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరావులు అన్నారు. కాంగ్రెస్ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం తల్లాడ మండలంలోని బాలపేట, రెడ్డిగూడెం గ్రామాల్లో, ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి, ఇంటింటికి కాంగ్రెస్ డిక్లరేషన్‌ను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ తెలంగాణాను దోచుకొని అప్పుల కుప్పగా మార్చారని, విద్యార్థుల భవిష్యత్‌ను నీళ్ల పాలు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు పరిచి ప్రజలకు సుపరిపాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, రాష్ట్ర ఎస్సీ డిప్యూటీ కన్వీనర్ కిరణ్, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్, వెంకటేశ్వర్లు, రవి, క్రిష్ణమూర్తి, కాంతారావు, నరసింహారావు, అంజయ్య, నాయకులు పిల్లి బోస్, షేక్ జానీబాషా, ఇనపనూరి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్’తో యువతలో మనోధైర్యం



మాట్లాడుతున్న రాందాస్‌నాయక్

వైరా: యువ సంఘర్షణ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రకటించిన రైతు, యూత్ డిక్లరేషన్‌తో నిరుద్యోగ యువతలో మనోధైర్యం నిపిందని పీసీసీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధుల, నియామకాల కోసం ఉద్యమం చేసిన యువకులకు నేడు ఉపాధి లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ అసలైన ఆకాంక్ష తీరుతుందని బంగారు తెలంగాణగా మారనున్నదని తెలిపారు. ఈ సమావేశంలో వైరా పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పమ్మి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, గుగులోత్ రాము, బొళ్ల గంగారావు, శ్రీను, కొండలు, కిరణ్, కృష్ణారావు, వీరయ్య, ఆయూబ్ ఖాన్, కోటేశ్వరరావు, హన్మంతురావు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

సత్తుపల్లి: గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వేంసూరు ఎగ్జిట్ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సత్తుపల్లి మండలం పాకలగూడెం గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం వేంసూరు ఎగ్జిట్ అఖిలపక్ష కమిటీ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జాతీయ రహదారికి సంబంధించిన ఎటువంటి అనుమతులు అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వేంసూరు సర్పంచ్ ఎండీ ఫైజుద్దీన్, గుర్నాథరెడ్డి, జగన్మోహన్‌రావు, నర్సింహారావు, చంద్రశేఖర్, అక్కిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కల ఆరోగ్యంపై అవగాహన

సత్తుపల్లిటౌన్: అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మొక్కల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయన, క్రిమిసంహారక మందులు వాడటం వల్ల మొక్కల ఆరోగ్యం, పర్యావరణంపై ప్రభావం చూపుతుందని వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.విజయ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రామచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న రమేష్

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన వంకాయలపాటి రమేష్ శుక్రవారం రూ.50 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా రమేష్‌ను గ్రామపెద్దలు అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకటేశ్వర్లు, బసవయ్య, చిన అప్పారావు, గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?



చెత్తను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడ్ మార్నింగ్ మధిర పేరుతో యాత్రలు చేస్తున్న నాయకులు వచ్చి ఈ చెత్తాచెదారం పెరిగిపోయి పరిసర ప్రాంత ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో ఒకసారి పరిశీలించాలని కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై గొప్పలు మాట్లాడే నాయకులకు ఇక్కడ పారిశుద్ధ్యం కనిపించడంలేదా అని ప్రశ్నించారు. రాయపట్నం రోడ్డులో షాదీఖానా వద్ద చెత్తను, బిడ్డి సమీపంలో డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, కాసిన నాగభూషణం, కొప్పురావూరి రామ యోగేశ్వరరావు, గరిడేపల్లి వేణు, కుక్కల రాము, శివ తదితరులు పాల్గొన్నారు.